ప్రజాశక్తి

సోమవారం ఏప్రిల్ 29 2024 8 పేజీలు

శ్రీకాకుళం

పోస్టల్ బ్యాలెట్‌పై కొరవడుతున్న అవగాహన

(4, 5లో)

జిల్లాకు ఏం మేలు చేశారు

- పదేళ్లలో ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేకపోయారు
- జగన్, చంద్రబాబుకు ఓటు ఎందుకు వేయాలి
- పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

సభలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు షర్మిల, పాల్గొన్న ప్రజలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, టెక్కలి

జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు చెరో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి జిల్లాకు ఏం మేలు చేశారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. న్యాయ్ యాత్రలో భాగంగా టెక్కలి పట్టణంలోని ఇందిరాగాంధీ కూడలి వద్ద ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తలపెట్టిన 30 వేల ఎకరాలకు సాగునీరందించే ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పట్టించుకోలేదన్నారు. తర్వాత అధికారం చేపట్టిన జగన్ ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. వంశధార ఎడమ కాలువ ఆధునీకరణ పనులు పూర్తి చేసి, శివారు భూములకు నీళ్లు ఇస్తామని చెప్పిన జగన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా వస్తే నియోజకవర్గానికి 50 నుంచి వంద వరకు పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగాలు వచ్చి యువత అభివృద్ధి చెందుతారని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం మాట్లాడిన నాయకులు, అధికారం చేపట్టిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. వైఎస్ ఆశయాలను సాధిస్తామని చెప్పున్న జగన్‌కి, ఆయనతో పోలికే లేదన్నారు. వైఎస్ హయాంలో రైతులకు రుణమాఫీ, ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఇచ్చారని గుర్తుచేశారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, జగన్ పట్టించుకోలేదన్నారు. పంటల మద్దతు ధర కోసం ఏటా రూ.మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పారని, ఏ ఏడాదైనా కేటాయించారా అని ప్రశ్నించారు. రైతులకు పంట నష్టం (మిగతా...2లో)

నిలిచేదెవరు..? తొలిగేదెవరు..?

- నేడు నామినేషన్ల ఉపసంహరణ
- జోరందుకోనున్న ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచేదెవరు..? తొలిగేదెవరో నేడు తేలనుంది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు చివరి రోజు కావడంతో ఉత్కంఠ నెలకొంది. నామినేషన్లు దాఖల చేసిన వారిలో ఒక్క ఆమదాలవలస నియోజకవర్గంలో తప్ప రెబల్ అభ్యర్థులు ఎవరూ లేకపోవడం వల్ల ప్రధాన పార్టీలకు ఇబ్బందులు తొలగిపోయాయి. అన్నిచోట్లా త్రిముఖ పోటీ అనివార్యం కానుంది. వైసిపి, టిడిపి కూటమి, ఇండియా ఫోరం అభ్యర్థులు ప్రధాన ప్రత్యర్థులుగా బరిలో దిగుతున్నారు. వీరితో పాటు స్వతంత్రులు, బిఎస్‌పి, జైభారత్ నేషనల్, పిరమిడ్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచే అవకాశం ఉంది.



జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు వచ్చిన 107 నామినేషన్లలో 82, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి 16 నామినేషన్లకు 13 నామినేషన్లు పరిశీలన ప్రక్రియను దాటి ఉపసంహరణ దశకు చేరుకున్నాయి. వీరిలో అన్ని నియోజకవర్గాల్లోనూ వైసిపి, టిడిపి కూటమి, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ప్రత్యర్థులుగా పోటీ పడనున్నారు. వీరితోపాటు కొన్నిచోట్ల స్వతంత్రులు పోటీలో నిలిచే అవకాశముంది. దీంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు పార్లమెంట్ బరిలో ప్రధాన పార్టీల నుంచి 27 మంది బరిలో నిలిచే అవకాశముంది. దీంతో అన్నిచోట్లా త్రిముఖ పోటీ తప్పదు.

ప్రణాళికతో ముందుకు...

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే (మిగతా...2లో)

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలని, ఆయన చెప్పేవేవీ చేయరని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు మండలంలోని పెద్దపాడు పంచాయతీ తంగివానిపేటలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఏమైతే చెప్పారో అవి అమలు చేసి, మళ్లీ అధికారం ఇవ్వాలని జగన్ కోరుతున్నారని తెలిపారు. ఎన్నికలప్పుడు చెప్పిన మాటలు అధికారంలో ఉండగా విస్మరించి, మళ్లీ ఎన్నికల సమయంలో కొత్త వాగ్దానాలతో మోసగించాలని చూడడం చంద్రబాబు నైజమన్నారు. రైతులు, కూలీలు, మహిళలు, మైనార్టీలు ఇలా అన్ని వర్గాల క్షేమానికి కట్టుబడి జగన్ పనిచేస్తున్నారని చెప్పారు. పేదలకు సాయం చేస్తే పథకాల పేరిట ధనం వృథా చేస్తున్నారని, రాష్ట్రం దివాళా తీస్తుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ఎలాగైనా అధికారంలోకి (మిగతా...2లో)

రూ.1.04 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - పొందూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రాపాక కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఎస్ఎస్‌టి బృందం చేపట్టిన తనిఖీల్లో రూ.1,04,500 ఆదివారం పట్టుబడింది. విజయనగరం జిల్లా రాజాంకు చెందిన కె.వెంకటరావు కారులో విశాఖపట్నం వెళ్తున్నారు. రాపాక కూడలి వద్ద ఆయన కారును తనిఖీ చేయగా ఈ నగదు లభించింది. ఆ మొత్తానికి సంబంధించి ఆయన ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో, దాన్ని సీజ్ చేసి ఉన్నతాధికారులకు అందజేసినట్లు తహశీల్దార్ ఎం.పాల్‌కిరణ్ తెలిపారు. తనిఖీల్లో డిటి సంతోష్ కుమార్, ఎస్ఎస్‌టి బృందం సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుల కోసం జవాన్ డిక్లరేషన్

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశ్రాంత, వీర సైనికులు వారి కుటుంబసభ్యుల సంక్షేమం కోసం ఎర్రన్న జవాను మిత్ర పేరుతో జవాన్ డిక్లరేషన్‌ను ప్రకటిస్తున్నట్లు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నగరంలోని ప్రజాసదన్‌లో విశ్రాంత సైనికులు, వారి కుటుంబ సభ్యులతో శ్రీకాకుళం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రన్న జవాను మిత్ర పేరుతో విశ్రాంత సైనిక ఉద్యోగులకు సేవలందిస్తానని తెలిపారు. దీంతోపాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి (మిగతా...2లో)

జీడి రైతు దిగాలు

- గణనీయంగా తగ్గిన దిగుబడి
- పెరిగిన పెట్టుబడి
- అప్పులపాలవుతున్న రైతులు

ఎండిపోతున్న జీడి చెట్లు

ప్రజాశక్తి - పలాస

జీడి రైతులకు ఈ ఏడాదీ కష్టాలు తప్పడం లేదు. గతేడాది దిగుబడి పర్వాలేకున్నా, గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తే... ఈ ఏడాది జీడిపిక్కల దిగుబడే గణనీయంగా తగ్గిపోయింది. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో జీడి రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాభావమే దిగుబడి తగ్గడానికి కారణమని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు.

పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి కంచిలి, సోంపేట ఉద్దానం ప్రాంతాలతో పాటు జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో రైతులు జీడి పంట సాగు చేస్తున్నారు. కేవలం జీడి పంటను నమ్ముకొని సుమారు 80 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జీడి పంట దిగుబడి వర్షాలపై ఆధారపడి ఉంటుంది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య వర్షాలు బాగా కురిస్తే ఆశించిన మేర దిగుబడి వస్తుంది. గతేడాది వెంటాడిన వర్షాభావ పరిస్థితుల ప్రభావం ఈ ఏడాది దిగుబడిపై పడింది. మెట్టు గట్టి నేలలో నీటి తేమ పూర్తిగా లేకపోవడంతో దిగుబడి మాట పక్కన పెడితే చెట్లు సైతం ఎండిపోతున్నాయి. సముద్ర తీర ప్రాంతాల్లోని ఇసుక నేలల్లో (మిగతా...2లో)

జిల్లాకు ఏం మేలు చేశారు

పరిహారం కోసం రూ.నాలుగు వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో, కళాశాల యాజమాన్యాల వద్దే ధ్రువపత్రాలు ఉన్నాయని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే 2.30 లక్షల ఉద్యోగాలను ఆరు నెలల్లో భర్తీ చేస్తామని చెప్పారని, ఐదేళ్లలో ఒక్క ఉద్యోగానైనా భర్తీ చేశారా అని ప్రశ్నించారు. ఏటా జాబ్ కేలెండర్ ప్రకటిస్తామన్నారని, ఐదు సంక్రాంతులు గడిచినా జాబ్ కేలండర్ మాత్రం గుండు సున్నా అని అన్నారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని చంద్రబాబుని విమర్శించిన జగన్, ఎన్నికల ముందు దగా డిఎస్‌సి ఇచ్చారని విమర్శించారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు సమయం కేటాయించని సిఎం జగన్, ప్రజలకేం సమయం కేటాయిస్తారని దుయ్యబట్టారు. జగన్ ప్రజలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారని చెప్పారు.

ప్రత్యేక హోదా రాకపోవడంతో రాష్ట్రానికి పది పరిశ్రమలైనా రాలేదని, అభివృద్ధిలో ఒక్క అడుగైనా ముందుకు పడలేదన్నారు. తెలంగాణలో ఒక నియంతని దింపడానికి 3,800 కిలోమీటర్లు పాదయాత్ర చేశానని, ఇక్కడ ప్రత్యేక హోదా వచ్చే వరకు కొట్లాడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో నాసిరకం మద్యం వల్ల 25 శాతం మంది గుండె, కాలేయం, కిడ్నీ వంటి వ్యాధులతో చనిపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం, ల్యాండ్ మాఫియా దోపిడీ సాగుతోందని విమర్శించారు. వీటికితోడు హత్యా రాజకీయాలూ సాగుతున్నాయని, సొంత చిన్నాన్నను హత్య చేసిన వారిని ఐదేళ్ల కాపాడుకుంటూ వచ్చారని విమర్శించారు. ఎన్నికల ముందు మేమంతా సిద్ధం అంటూ వస్తున్నారని, రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేయడానికా?, మోడీతో రాష్ట్ర ప్రయోజనాల్ని తాకట్టు పెట్టడానికి సిద్ధమవుతున్నారా అని షర్మిల ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రతి ఇంటికీ సంక్షేమ పాలన అందిస్తామన్నారు. వైసిపి, టిడిపి ఎన్నికల్లో డబ్బులు ఇస్తే తీసుకోవాలని, ఓటు వేసినప్పుడు మంచి చేసే పార్టీకే ఓటు వేయాలని కోరారు. మీ జీవితాల్ని, పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టవద్దన్నారు.

అభివృద్ధిని విస్మరించిన వైసిపి, టిడిపి

జిల్లా అభివృద్ధిని వైసిపి, టిడిపి గాలికొదిలేశాయని డిసిసి అధ్యక్షులు, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు విమర్శించారు. జిల్లాల పునర్విభజన తర్వాత ఐటిడిఎ లేని జిల్లాగా శ్రీకాకుళం మిగిలిందని, దాన్ని ఎవరూ పట్టించుకోలేదన్నారు. జీడి రైతులకు మద్దతు ధర కూడా ఇవ్వలేదన్నారు. మత్స్యకారులకు కనీసం కోల్డ్‌స్టోరేజ్‌లు కూడా నిర్మించలేదని విమర్శించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీల

మొదటి పేజీ తరువాయి

అమలుకు షర్మిల న్యాయ్ యాత్ర చేపడుతున్నారని కేంద్ర మాజీ మంత్రి, టెక్కలి అసెంబ్లీ అభ్యర్థి కిల్లి కృపారాణి తెలిపారు. దేశ సమగ్రత, సమైక్యత, లౌకికవాదానికి కట్టుబడిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జిల్లాలోని 25 సామాజిక తరగతులను ఇబిసి జాబితాలో చేర్పించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తాను కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో 92 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తే, ఒక్క గ్రామానికే పరిమితం చేసిన దద్దమ్మ ప్రభుత్వాలు టిడిపి, వైసిపి అని ధ్వజమెత్తారు. వైసిపిలో తాను ఎన్నో అవమానాలకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, పలు నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు సనపల అన్నాజీరావు, మంత్రి నర్సింహమూర్తి, సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిలిచేదెవరు..? తొలిగేదెవరు..?

వైసిపి, టిడిపి అభ్యర్థులు ప్రచార బరిలోకి దిగారు. ఆయా నియోజకవర్గాల్లో మొదటి నుంచీ ఆశావహులుగా ఉన్న వారికే వైసిపి టిక్కెట్లు కేటాయించింది. టిడిపి మాత్రం శ్రీకాకుళం, పాతపట్నంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఉన్న వారిని కాదని కొత్త ముఖాలను తెర పైకి తీసుకొచ్చింది. పొత్తులో భాగంగా ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానాన్ని బిజెపికి కేటాయించింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించింది. ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు.

ప్రచారం జోరు

నామినేషన్ల ఉపసంహరణ తర్వాత జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకోనుంది. సామాజిక సమీకరణాలతో పాటు వ్యూహ, ప్రతి వ్యూహాలతో ప్రత్యర్థులకు ధీటుగా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఒక వైపు వేసవి తాపం పెరగడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో ఓటర్లను కలిసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. ఇండియా ఫోరం అభ్యర్థులు సామాన్యులకు చేరువయ్యేందుకు ఉన్న అవకాశాలను వినియోగించే పనిలో ఉన్నారు. ఇప్పటికే వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రను జిల్లాలో ముగించగా, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రజాగళం సభల్లో పాల్గొన్నారు. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల న్యాయ్ యాత్రలో భాగంగా జిల్లాలో పర్యటించారు.

జవాన్ డిక్లరేషన్

చేస్తానని చెప్పారు. అమరులు, వికలాంగులైన సైనిక కుటుంబాలకు కార్పస్ నిధి కింద ప్రత్యేక నిధుల కేటాయింపు కోసం పనిచేస్తామన్నారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు, ప్రభుత్వరంగ సంస్థల్లో జవాన్లకి కేటాయించిన రిజర్వేషన్ అమలు చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన సైనికులకు ఆదాయ మార్గాన్ని కల్పించేలా ప్రత్యేక జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీకాకుళంలో అమరవీరుల స్థూపం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్మీలో ఆఫీసర్ ర్యాంకు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే వారికి కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులకు విశ్రాంత సైనిక కుటుంబాలు ఆశీస్సులు అందించాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు కొర్ను నాగార్జున ప్రతాప్, అరవల రవీంద్ర, దుంగ భాస్కర్, బస్వా నాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే

రావాలని అంతకు మూడు రెట్లు ఇస్తామంటున్నారని విమర్శించారు. జగన్ అమలు చేయగలిగేవే చెప్తున్నారని, అమలు చేయరు కాబట్టి చంద్రబాబు ఎంతైనా ప్రకటిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పారని, చేశారా అని ప్రశ్నించారు. డ్వాక్రా రుణాలు చెల్లిస్తానని చెప్పారని, అదైనా చేశారా అంటే లేదని, చివరకు జగన్ వాటిని తీర్చారని తెలిపారు. ఇప్పుడు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు చెప్తున్నారని, 2014-19 మధ్య కాలంలో ఏం చేశారని ప్రశ్నించారు.

వైసిపి ప్రభుత్వంలోనే జిల్లా అభివృద్ధి చెందిందన్నారు. శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిని 900 పడకలతో తీర్చిదిద్ది, వైద్యులు, వైద్య పరికరాలను ఏర్పాటు చేసి, విశాఖపట్నంకు రిఫర్ చేయకుండా ఆస్పత్రిని అభివృద్ధి చేశామన్నారు. మూలపేటలో రూ.నాలుగు వేల కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టి, జిల్లాను ప్రపంచంతో కనెక్ట్ చేశామని చెప్పారు. ఉద్దాన ప్రాంతానికి రూ.800 కోట్లతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉపరితల జలాలు అందించేందుకు సంబంధించిన ప్రాజెక్టు పూర్తి చేశామన్నారు. అలా ఆరు మండలాల తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు. వంశధార నీరు ఇంటింటికీ అందించామన్నారు. రూ.200 కోట్లతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పాలనను ప్రజల గుమ్మం దగ్గరకు తీసుకొచ్చామని తెలిపారు. ఇప్పుడు ఏ పని కావాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరమే లేదన్నారు. అవినీతి రహిత పాలనకు పట్టం కట్టిన వైసిపి ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు.

జీడి రైతు దిగాలు

కొద్దోగొప్పో నీటి తేమ శాతం ఉండడంతో చెట్టు ఎండిపోకున్నా, దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది.

గణనీయంగా తగ్గిన జీడి దిగుబడి

జీడి సాగుపై తిత్లీ తుపాను తీవ్ర ప్రభావం చూపింది. సుమారు 23 వేల ఎకరాల్లో జీడి పంట నాశనమైంది. ఆ తుపాను సమయంలో ఎక్కడికక్కడ జీడి చెట్లు నేలకూలడంతో రైతులు కంటతడి పెట్టుకున్నారు. ఒకవైపు నేలకొరిగిన చెట్లను తొలగించేందుకు పెట్టుబడులు పెట్టగా, మరోవైపు దిగుబడి పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టామని, పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడిపిక్కల దిగుబడి ఎకరాకు నాలుగైదు బస్తాల వరకు వచ్చేది. ఈ ఏడాది మెట్టు నేలలో ఎకరాకు బస్తా, సముద్ర తీర ప్రాంతాల్లో బస్తాన్నర మాత్రమే వచ్చిందని రైతులు చెప్తున్నారు. పంట కోసం చేసిన అప్పులకు వడ్డీలు కూడా కట్టలేని దయనీయ స్థితికి చేరడంతో జీడి రైతులు లబోదిబోమంటున్నారు.

కానరాని గిట్టుబాటు ధర

మూడేళ్లుగా నష్టాలు చవిచూసిన రైతులకు గతేడాది జీడి పిక్కల దిగుబడి బాగుండడంతో నష్టాల నుంచి గట్టెక్కవచ్చని భావించారు. వారిలో ఆ ఆనందం లేకుండా వ్యాపారులు చేశారు. గతేడాదికి ముందు జీడి పిక్కల బస్తా రూ.12 వేల నుంచి రూ.14 వేలు పలికేది. వైసిపి ప్రభుత్వం వచ్చాక రూ.తొమ్మిది వేలు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వం నుంచి అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. గతేడాది ప్రారంభంలో జీడి పిక్కల బస్తా రూ.ఎనిమిది వేలు పలకగా, వ్యాపారులు కుమ్మక్కై ఒక్కసారిగా బస్తా రూ.ఆరు వేలకు పడిపోయింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం అక్కర చేయకుండా పోయింది. రూ.వెయ్యి ప్రభుత్వం తరుపున ఇస్తామని మంత్రి సీదిరి అప్పలరాజు ఇచ్చిన హామీ ఆచూకీ లేకుండా పోయింది. ధర లేక, పెరుగుతున్న వడ్డీలను భరించలేక తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు బస్తాను రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేల వరకు తెగనమ్ముకున్నారు. ఈ ఏడాది జీడి పిక్కల దిగుబడే తక్కువ కాగా, వాటికీ మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

ఎకరాకు బస్తా వచ్చింది

గతేడాది ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో, జీడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎకరాకు కేవలం బస్తా కూడా రావడం లేదు. గతేడాది దిగుబడి పెరిగిందంటే, ధర లేక తీవ్రంగా నష్టపోయాం. ఈ ఏడాది దిగుబడి లేక పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక నష్టపోతున్నాం.

- తామాడ త్రిలోచనరావు,
రైతు, బొడ్డపాడు

జీడి రైతులను ఆదుకోవాలి

వరి పంటలా జీడి పంట పండించే ప్రాంతాన్నీ కరువు ప్రాంతంగా ప్రకటించాలి. వర్షాభావంతో పంట పోయి దిగుబడి బాగా తగ్గిపోయింది. పంటకు రూ.30 వేలు పెట్టుబడి పెడితే, రూ.10 వేలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపి జీడి రైతులకు ఆదుకోవాలి.

- తెప్పల అజయ్ కుమార్
జిల్లా కన్వీనర్, జీడి రైతుల సంఘం

సంక్షేమమే జగన్ సంకల్పం

- మేనిఫెస్టోతో మరోసారి రుజువు
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

ప్రజల సంక్షేమమే తన సంకల్పమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాజా మేనిఫెస్టోతో మరోసారి రుజువు చేశారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రకటించిన నమ్మశక్యమైన మేనిఫెస్టో చూసి ప్రజలందరూ ఆనందంగా ఉన్నారన్నారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం మీద చిత్తశుద్ధితో పనిచేస్తుందనడానికి ఈ మేనిఫెస్టో నిదర్శనమన్నారు. వైద్యంలో ఆరోగ్యశ్రీ విస్తరణ, ఆరోగ్య ఆసరా, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్,

17 కొత్త మెడికల్ కళాశాలలు, జగనన్న ఆరోగ్య సురక్ష ఉన్నాయని తెలిపారు. వ్యవసాయంలో రైతుభరోసా, ఆర్‌బికెలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, పగటిపూటే తొమ్మిది గంటల ఉచిత విద్యుత్, సమయానికే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. ఉన్నత విద్య, పాఠశాలలు, ఆస్పత్రుల్లో నాడు-నేడు, పేదలందరికీ ఇళ అక్కచెల్లెమ్మల పేరిట పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, మహిళా సాధికారత, చేయూత, కాపునేస్తం, ఇబిసి నేస్తం, సున్నా వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ కానుక రెండు విడతల్లో రూ.3,500కు పెంపు, అభివృద్ధి, మౌలిక వసతులు, సుపరిపాలన, కళ్యాణమస్తు, షాదీ తోఫా, అమ్మఒడి ఇలా ఏది తీసుకున్నా నిధులు భారీగా పెంచారని చెప్పారు. పేదల పక్షపాతిగా జగన్ ఇన్ని పథకాలు ప్రకటించారని తెలిపారు. నీతిగా, నిజాయితీగా, నిస్వార్థంగా ప్రజలకు మేలు చేయాలనే సంకల్పం ఉన్న జగన్ మళ్లీ సిఎం కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు పాత వాహన వేలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంపోలులోని జిల్లా కేంద్ర కారాగారం పరిధిలో గల నిరుపయోగమైన టాటా వ్యాను 407 పాత వాహనాన్ని ఈనెల 30న వేలం వేస్తున్నట్లు జిల్లా జైలు పర్యవేక్షణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అంపోలు జైలు ఆవరణలో ఉదయం తొమ్మిది గంటలకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.మూడు వేలు డిపాజిట్ చెల్లించాలని, వేలం పూర్తయిన తర్వాత పాడుకున్న మొత్తాన్ని చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. 18 శాతం జిఎస్‌టి అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8622039999, 9494633335 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDL DISTRICT JUDGE CUM FAMILY COURT AT SRIKAKULAM.
CMA 14/2023.

Between:
Sri Tadela srinivasa Rao ...Appellant
And:
Smt.Gorle Sarojinamma and 2 others ...Respondents.

NOTICE

3rd Respondent: Gorle sumanth, s/o Krishna murthy aged 25 years Hindu, R /at vedulavalasa village, polaki mandalam, srikakulam district.

Please take notice that above CMA 14/2023.filed by the appellant against you and the matter posted to **10-05-2024.** for notice to the 3rd respondent, You should appear in person or through an advacate **10.30 AM.,** On the above said date in the above court. If you fails to appear on 10-05-2024. Other wise matter will be decided on exparte.

// By order of the court //
MATHALA CHANDANA
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9059514667.

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ఆమదాలవలస : సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న సుజాత

శ్రీకాకుళం రూరల్ : మహిళతో మాట్లాడుతున్న జగన్నాథరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అన్ని వర్గాల ప్రజల భవిష్యత్, భరోసా టిడిపితోనే సాధ్యమని జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత అన్నారు. ఆదివారం మండలంలోని నిమ్మతొర్లాడ, పాతూరు, సిరిసింపేట, వెదుళ్లవలస, గొల్లపేట, నెల్లిపర్తి గ్రామాల్లో శంఖారావం కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ఇదేళ్ల పాలనలో అన్ని వర్గాల వారికి భవిష్యత్ భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంకుశ విధానాలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న కూన రవికుమార్, ఎంపీగా పోటీ చేస్తున్న కింజరాపు రామ్మోహన్ నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు, తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని అమర్నాథ్, గొర్లె సూర్యం, కోరుకొండ వెంకటరమణ, సనపల చెల్లం నాయుడు, గొండు రమణ, చేపేన సత్తిరాజు, ఎండ అప్పలనాయుడు, వెంకటరమణ, బుజ్జి పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పట్టించుకోని పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎంపిపి గొండు జగన్నాధరావు అన్నారు. మండలం బలివాడ పంచాయతీ బలివాడలో లక్ష్మీనారాయణ, చిన్నవాడాడలో శిమ్మ శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు పథకాలను వివరించారు. ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభర్థి గొండు శంకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు : దల్లవలసలో ప్రచారం చేస్తున్న ప్రమీల

పొందూరు: మండలం దల్లవలసలో టిడిపి శంఖారావం కార్యక్రమంలో భాగంగా టిడిపి అభ్యర్ధి కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నారాయణరావు, మాజీ సర్పంచ్ కిల్లాన అప్పల రాములు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, వరదరాజులు పాల్గొన్నారు.

దళితులను దగా చేసిన జగన్

మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

2019 ఎన్నికల్లో దళితులు నా మేనమామలంటూ దళిత వాడలకు వెళ్లి ముద్దుల మీద ముద్దులు పెట్టి తన గెలుపులో అత్యంత కీలకపాత్ర పోషించిన దళితులకు చరిత్రలో ఏ పాలకుడు చేయని నష్టాని జగన్మోహన్‌రెడ్డి చేశాడని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర కార్యదర్శి యర్రం సుధీర్ కుమార్ అన్నారు. ఈ మేరకు కోటబొమ్మాళిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దళిత పథకాలను నిర్వీర్యం చేసి దళితులకు శిరోముండనం చేసిన జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కాకుండా సమతాసైనిక్ దళ్ రాష్ట్రవ్యాప్తంగా దళిత ఓటర్లను చైతన్యపరుస్తున్నామని అన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో దళితులకు జరిగిన అన్యాయం ఏ ప్రభుత్వంలోను జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై అట్రాసిటీ, దళితలకు చంపి డోర్ డెలివరీ చేయడాలు, దళితులకు శిరోముండనం కేసులో శిక్షపడిన వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టడం, మాస్కులేదని ప్రభుత్వానికి అడిగినందుకు దళిత డాక్టర్‌ను పిచ్చివాడిగా చిత్రీకరించి ఆత్మహత్యచేసుకొనే విధంగా ప్రేరేపించారని అన్నారు. దళితులకు ఎప్పటి నుంచో అమలు అవుతున్న 27 పథకాలను నిసిగ్గుగా రద్దు చేయటం, అంబేద్కర్ విదేశి విద్యను జగనన్న విదేశి విద్యగా పేరు మార్చటం చూస్తే అంబేద్కర్‌కి జగన్‌కు ఎక్కడ పోలిక అని ప్రశ్నించారు. గతంలో ఉన్నత చదువులు కోసం అయ్యే ఖర్చు దళితులకు ప్రభుత్వమే భరించేదని పేర్కొన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని అన్నారు. ల్యాండ్ కొనుగోలు పథకం రద్దు చేశారని తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్‌ను మాల, మాదిగ, రెల్లి కార్పొరేన్లగా విడదీసి ఒక్క రూపాయి సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయకుండా దళితులకు అన్యాయం చేశారని ఆరోపించారు. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న 17 మెడికల్ కళాశాలలో ఎస్‌సిలకు రిజర్వేషన్ కోత విధించిందని అన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ ప్రసన్న కుమార్, ఎం.ప్రేమ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పేర తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

పార్టీలో చేరిన వారితో మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని శిలాగం సింగువలసకు చెందిన 50 కుటుంబాలు ఆదివారం వైసిపిలో చేరారు. పెదపాడు వద్ద ఉన్న ధర్మాన క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వారికి వైసిపి కండువాలు వేశారు. పార్టీలో చేరిన వారిలో రావాడ లక్ష్మీనారాయణ, భూలోకం, కుంచాల బుద్ధిస్వామి, రామరావు, నాగరత్నం, కర్రి అప్పయ్య, తదితరులు ఉన్నారు.

నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్ నుంచి దూసి నాగేశ్వరరావు టిడిపి నుంచి వైసిపిలో చేరారు. ఆయనకు మంత్రి ధర్మాన కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గుమ్మా నగేష్, శిమ్మ రాజశేఖర్, కామేశ్వరీ, ఎం.అన్నం నాయుడు, వై.వెంకటరమణ, తిరుమల, ఎం.వెంకటరమణ, డి.శ్రీను, తారక, గాయత్రి పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలం రణస్థలం పంచాయతీ నగరపాలెంకు చెందిన 200 కుటుంబాలు వైసిపి నాయకులు కరిమజ్జి భాస్కరరావు, పిన్నింటి లక్ష్మునాయుడు, మజ్జి రమేష్, కరిమజ్జి మహేష్, కెల్ల ఆదినారాయణ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో టిడిపి నుంచి వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కెల్ల రామునాయుడు, భాష, మాలచ్చి, గోవింద, పంపురెడ్డి లచ్చుము, పిన్నింటి శ్రీను తదితరులున్నారు. ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

50 మద్యం సీసాలు పట్టివేత

ఇచ్ఛాపురం : మండలంలోని అరకభద్ర వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పెట్రోలింగ్ పార్టీ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 50 మంది సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి ఇచ్ఛాపురానికి అక్రమంగా మహిళ మద్యం సీసాలను తరలిస్తుంది. ఈ సందర్భంగా పెట్రోలింగ్ పార్టీ ఎస్ఐ పి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఒడిశాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి అరకభద్రలో ఎక్కువ ధరకు విక్రయించడానికి మద్యం సీసాలను తరలిందని అన్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దాడుల్లో సిబ్బంది కూర్మనాయకులు, నాయుడు పాల్గొన్నారు.

నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సవర మురికింటిభద్ర, రాయిగుడ్డి గ్రామాల్లో ఆదివారం పలాస ఎఇఎస్ఐఎ బేగం ఆధ్వర్యాన కార్డాన్ చర్చ్ నిర్వహించారు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయిగుడ్డిలో 70 లీటర్లు, మురికింటిభద్రలో 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేశారు. కార్యక్రమంలో టెక్కలి సెబీ సిఐ రాజశేఖర్ నాయుడు, పలాస డిటిఎఫ్ సిఐ రామచంద్రకుమార్, పాతపట్నం సిఐ ఎన్.సాయి, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్ పాల్గొన్నారు.

మంత్రి అప్పలరాజు ఓటమే లక్ష్యం

పలాస: పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఓటమే లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. మండలంలోని గరుడఖండి, గోపాలపురం, లక్ష్మీపురం, నీలిభద్ర, నారాయణపురం గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. వంశధార సాగునీరు పంట భూములకు సకాలంలో అందిస్తామని చెప్పారు. రైల్వే వంతెన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, కొర్ల కన్నారావు, బడ్డ నాగరాజు, పైల చక్రధరరావు, యవ్వారి మోహనరావు, దువ్వాడ శ్రీహర్ష, సంతోష్, దువ్వాడ శ్రీకాంత్, దానేటి పద్మజీ, కొర్ల విష్ణు పాల్గొన్నారు.

గోపాలపురంలో ప్రచారం టిడిపి నాయకులు

వైసిపి నాయకుల ప్రచారం

కవిటి: వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థి పిరియా విజయను ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ కోరారు. మండలంలోని గొండ్యాలపుట్టుగలో పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో తమని ఆదరించకపోయినా నియోజకవర్గ అభివృద్ధికి జెడ్‌పి చైర్‌పర్సన్ హోదాలో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

టిడిపిలో చేరిన వరం కుటుంబ సభ్యులు

ఆహ్వానించిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలం రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అనుచరులుగా ఆయన వెంటే వైసిపిలో కొనసాగిన మాజీ మున్సిపల్ చైర్మన్ అందవరపు వరహనర్సింహం కుటుంబ సభ్యులు ఆపార్టీని వీడి ఆదివారం టిడిపిలో చేరారు. ఆయన కుమార్తె, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతితో పాటు ఆమె సోదరులు అందవరపు ప్రసాద్, సంతోష్‌లు ఎంపీ రామ్మోహన్ నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. గుజరాతీపేటలో ఉన్న వారి నివాసానికి శ్రీకాకుళం కూటమి అభ్యర్థి గొండుశంకర్‌తో కలిసి ఆదివారం వెళ్లి ముగ్గురిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరితో పాటు ఆప్రాంతంలో ఉన్న 500 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ టిడిపి పేద ప్రజలకు భరోసా కల్పించడంలో ముందుంటుందని తెలిపారు. టిడిపి పట్ల అభిమానం చూపి పార్టీలో ఇన్ని వందల కుటుంబాలు చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వరం కుటుంబ సభ్యులు టిడిపిలో చేరడంతో నగరంలో టిడిపికి పూర్వవైభవం వచ్చిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ మాట్లాడుతూ ఎంతో రాజకీయ చరిత్ర కలిగిన వరం కుటుంబం టిడిపిలో చేరడం నగరంలో పార్టీ అదనపు బలాన్ని సంతరించుకుందన్నారు. ఎప్పటికి వైశ్యులకు తగిన గుర్తింపు టిడిపిలోనే వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పైడిశెట్టి జయంతి, టిడిపి రాష్ట్ర నాయకులు బోయిన గోవిందరాజులు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, పివి రమణ, కొర్ను ప్రతాప్, పైడిశెట్టి బెనర్జీ, జామి భీమశంకర్, కిల్లంశెట్టి చక్రవర్తి, కరగాన భాస్కరరావు, కరగాన రాము, సీపాన మల్లేశ్వరరావు, సుశీల, సీపాన రమ, రమేష్, నాగేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, శంకర్

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష

ప్రచారం చేస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- మందస

పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మందస మండలంలోని కొండలు, గుట్టలు, వాగులు, వంకలు సైతం మింగేస్తున్నారని, తనకు ఒక్క అవకాశం ఇస్తే మందస ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష హామీనిచ్చారు. మండలంలోని సిరియాపల్లి పంచాయతీలో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు, బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి గౌతు శివాజీ మందస ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. ఆ సమయంలో కళింగ దళ్, దామోదరసాగర్, జంతిబంద, డబారసింగ్ రిజర్వాయర్లను నిర్మించి పంట భూములకు సాగునీరు అందించారని అన్నారు. అప్పలరాజు కనీసం పాడైన రిజర్వాయర్లకు మరమ్మతులు కూడా చేపట్ట లేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రిజర్వాయర్లను ఆధునికీకరణ పనులు చేపట్టి సాగునీరు అందిస్తామని హామీఇచ్చారు. ప్రభుత్వ స్థలాలు, ప్రయివేటు వ్యక్తుల ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నాయని, తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అక్రమాలు తొలగించి వారి వారి ఆస్తులను అప్పగిస్తానని అన్నారు. కొండలు, గుట్టలు ధ్వంసం చేయడం వల్లే గ్రామాల్లోకి ఎలుగులు, వన్యప్రాణులు వచ్చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలుగు ప్రజలపై దాడులు చేస్తున్నా మంత్రి హోదాలో ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. తాను అధికారంలోకి వచ్చాక ఎలుగుల నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్దాన ప్రాంతంలో డిఫెన్స్ అకాడమీ, సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్ నాయుడును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి తాతారావు, బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు పాల్గొన్నారు.

వైసిపి అసత్య ప్రచారాలను నమ్మొద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

వైసిపి అసత్య ప్రచారాలను నమ్మొద్దని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. గార మండలం రామచంద్రపురం పంచాయతీ జొన్నలపాడులో ఆదివారం అంబటి చక్రధర్, సాధు శ్రీరామ్, కుంచాల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ పోస్టర్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ చూడని అరాచక పాలన రాష్ట్రంలో గత అయిదేళ్లు కొనసాగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం లేకపోయినా తలసరి అప్పులు మాత్రం పెరిగిపోయాయన్నారు. నిత్యవసర సరుకులు, పెట్రోల్, గ్యాస్ ఇలా అన్ని ధరలు పెరిగి సామాన్యుడి బతుకు దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. రానున్న ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న స్వాతి

అప్పలరాజు ప్రచారం

పలాస: మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసానని, మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 17, 18, 19, 20 వార్డులైన సూదికొండ, తిలక్‌నగర్, లేబర్ కాలనీ, రోటరీనగర్ ప్రాంతాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు ఇప్పటికే పైప్‌లైన్ల పనులు చేపట్టామని అన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టి మున్సిపాలిటీని అభివృద్ధి చేశానని చెప్పారు. రోడ్డు విస్తరణ పనుల ద్వారా పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయని, అందులో పని చేస్తున్న యువకులకు ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు. ఇప్పటికే కాశీబుగ్గ రైల్వే వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిని గాలికి వదిలేస్తే... పలాసకు డిగ్రీ కళాశాల, సబ్ డివిజన్ కార్యాలయం, పలాస ప్రభుత్వాస్పత్రికి అదనపు భవనాలు, నాడు-నేడు పథకం ద్వారా జూనియర్ కళాశాలలో భవనాలు నిర్మాణం చేట్టామని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, వైస్ చైర్మన్ బోర బుజ్జి, శిష్టి బృందావతి, శిష్టి గోపి, బడగల బల్లయ్య, గుజ్జు జోగారావు, సనపల సింహాచలం పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యం

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం పట్టణంలోని 17వ వార్డు పూజారిపేట, 2వ వార్డు కృష్ణాపురంలో ఇంటింటా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లను పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి పార్టీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే అందించిన ఘనత జగమోహన్ రెడ్డికే దక్కిందన్నారు. సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు పాలనను తీసుకువచ్చారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైసిపికి పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లం శెట్టి ఉమా మహేశ్వరరావు, బొడ్డేపల్లి అజంతా కుమారి, దుంపల శ్యామలరావు, మామిడి రమేష్, దుంపల చిరంజీవి, మామిడి ప్రభాకర్, విజయ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సీతారాం

ఆదరించండి

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

మీ అందరి వాడినైన తనను ఆదరించండి, మీకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ కోరారు. ఆదివారం మండలంలోని అల్లెనలో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తనను ఆదరిస్తే ప్రజా సమస్యలను తీర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సమర్ధవంతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. అంతకు ముందు తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు విచక్షణ కలిగిన నాయకత్వానికి పట్టం కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రచార రథంపై తన ప్రచారాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వి.సీతారాం బాబు నాయుడు, పేడాడ సూరప నాయుడు, కొత్తకోట నాగేందర్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ, కొల్ల జయరాం, తుడ్డలి సర్పంచ్ గణపతిరావు పాల్గొన్నారు.

లెక్కలు చూపేది గోరంత... ఖర్చు పెట్టేది కొండంత

ప్రజాశక్తి- జి.సిగడాం

ఎన్నికల్లో అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చు పెడితే చర్యలు తీసుకుంటామని ఎచ్చెర్ల నియోజకవర్గ వ్యయ పరిశీలకులు ఎన్నికల షెడ్యూల్ విడుదల రోజున హెచ్చరికలు జారీ చేసింది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దాదాపు 47 రోజులు గడిచింది. ఈ కాలంలో అభ్యర్థులు కొండంత ఖర్చు చేసి గోరింత చూపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంది. అంతకుమించి ఖర్చు చేస్తే అనర్హులుగా ప్రకటించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది. ఎన్నికల సంఘం విధించిన పరిమితికి మించి ఖర్చు అభ్యర్థులు ఒక్క నామినేషన్ రోజునే చేసిన పరిస్థితి కనిపిస్తోంది. ఎచ్చెర్లలో ఒక అభ్యర్థి ఇటీవల వేసిన నామినేషన్ రోజున 20 వేల మందికిపైగా భోజనాలు పెట్టిన పరిస్థితి ఉంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో నామినేషన్ వేసేందుకు వైసిపి, టిడిపి అభ్యర్థులు చేసిన ఖర్చు ఒక్క రోజే కనీసం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకూ ఉంటుందని అందరూ అంచనా వేశారు. వైసిపి, టిడిపి కూటమికి చెందిన అభ్యర్థులు వీరు అని తేడాలేకుండా ప్రధాన పార్టీలైన డబ్బు భారీగా ఖర్చు చేస్తున్న పరిస్థితి కళ్ల ముందే కనిపిస్తోంది. బైక్, కారు ర్యాలీలు, జనాన్ని డబ్బులిచ్చి తరలించడం వంటివి ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ర్యాలీకి వచ్చిన బైక్‌లకు పెట్రోల్ ఖర్చు, నామినేషన్‌కు వచ్చినందుకు ఒక్కో వ్యక్తికి రూ.200 నుంచి రూ.500 వరకూ ఇస్తున్న పరిస్థితి ఉందని అందరూ భావిస్తున్నారు. రూ.లక్షలు విలువ చేసే బాణసంచా రిటర్నింగ్ అధికారుల కార్యాల యాల ముందే కాల్చారు. రోజూ ప్రచారంలో వందల మంది ఉంటున్నారు. వీరికి అయ్యే ఖర్చు రోజువారీగా రూ.లక్షల్లో ఉంటుందని అభ్యర్థులే చెబుతున్న పరిస్థితి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల సాగాలంటే విచ్చలవిడిగా సాగుతున్న ఖర్చును నిరోధించాల్సి ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ అభ్యర్థులు రూ.కోట్లలో ఖర్చు చేసిన పరిస్థితి ఉంది. ఈ విధంగా లెక్క చూసుకున్న ఎలక్షన్ కమిషన్ ఇచ్చే పరిమితే మించే ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చు అవుతున్నా ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్‌పోస్టులో తనిఖీల్లో ఒక్క రూపాయీ ఏ రాజకీయ నాయకుడి నుంచీ రికవరీ చేసిన దాఖలాలు లేవు. చెకుపోస్టు తనిఖీల్లో, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఇప్పటివరకు నామమాత్రంగానే తనిఖీలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోస్టల్ బ్యాలెట్‌పై కొరవడుతున్న అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పోస్టల్ బ్యాలెట్, వయోవృద్ధులు, 40 శాతం పైబడి అంగవైకల్యం ఉన్నవారికి ఈసారి హోమ్ ఓటింగ్‌కు ఎన్నికల సంఘం అవకాశమిచ్చింది. అయితే హోమ్ ఓటింగ్ కు ముందు ఏంచేయాలి, ఓటింగ్‌కు ఇంటికే వస్తారా? లేక ఓటింగ్ కేంద్రానికి వెళ్లాలా.. ఈప్రక్రియ ఎప్పుడు జరుగుతుందన్న అనుమానాలు పోస్టల్ బ్యాలట్ వినియోగించుకునే వారిలో ఉన్న అనుమానాలు. వీటిని క్షేత్రస్థాయిలో నివృత్తి చేయాల్సిన యంత్రాంగం ఆ దిశగా పనిచేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓటింగ్ శాతం పెంచాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ మార్పులను ఓటరు సద్వినియోగ పరచుకునేలా అవగహన కల్పించాలి. పని ఒత్తిడి కారణంగా క్షేత్రస్థాయి యంత్రాంగం ఆ ప్రయత్నం చేయడం లేదు. హోమ్ ఓటింగ్ వ్యవహారంపై జిల్లా ఎన్నికల యంత్రాంగం గతంలో స్పష్టత ఇచ్చినప్పటికీ ఫారం-12 అసలు ఎక్కడ దొరుకుతుందో కూడా తెలియక అవస్థలు పుడుతన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పోస్టల్ బ్యాలెట్, వయోవృద్ధులకు, వికలాంగులకు హోమ్ ఓటింగ్ వేర్వేరుగా జరగాల్సి ఉంటుంది. ఫాం-12, ఫాం-12డి ఎక్కడ ఇవ్వాలి, ఓటింగ్ ఎప్పుడు ఏయే కేంద్రాల్లో ఇవ్వాలి వంటి అనుమానాలు నివృత్తి కావడం లేదు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగ, ఉపాధ్యాయులకే కాదు... హోమ్ ఓటింగ్, ఇతర విధులు, అత్యవసర సేవల్లో ఉండే 33 శాఖలకు చెందిన ఉద్యోగులు, సర్వీసు ఓటర్లకు వేర్వేరుగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు స్థానిక జిల్లాలో పనిచేసే ప్రాంతాల్లోనే ఫాం-12 ఇవ్వాలి. జిల్లాకు చెందిన వారు ఇతర జిల్లాల్లో పనిచేస్తుంటే... పనిచేస్తున్న ప్రదేశంలోనే ఫాం -12 అందించాల్సి ఉంటుంది. ఓటు ఉన్న చోటే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చు. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ షెడ్యూల్ విడుదలైంది. తాజా ఉత్తర్వుల ప్రకారం విధులు నిర్వర్తించే అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల ఆర్‌ఒలకే ఫాం -12 ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మే 3 నుంచి 6 వరకు ఓటింగ్ ఉంటుం ది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఎనిమిది నియోజకవర్గ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగంచుకోవచ్చు. 85 ఏళ్లపై బడిన వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం ఉంటుంది. మే 5 నుంచి 9 వరకు వికలాంగులు, వయో వృద్ధులకు ఇంటి వద్దే ప్రత్యేక టీమ్‌ల ద్వారా ఓటు హక్కు కల్పిస్తారు. జిల్లాలో ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హతున్న వయో వృద్ధులు 14,836 మంది, 40 శాతం పైబడి అంగవైకల్యం ఉన్న వికలాంగులు 20732, అనారోగ్యంతో మంచాన పడ్డవారు 297, సీర్వసు ఓటర్లు 16,233 మంది ఉన్నారు. వీరు కాకుండా ఎన్నికల విధుల్లో ఉన్న వారు. మిగిలిన 33 ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఇస్తున్నారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవడం ద్వారా ఓటు హక్కు పొందాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం కోరుతోంది.

ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

కాంగ్రెస్ ప్రచారానికి స్పందన

రణస్థలం: విజయనగరం లోక్ సభ, ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని విజయనగరం ఎంపీ అభ్యర్థి బొబ్బిలి శ్రీను, ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు కోరారు. ఆదివారం నగరపాలెం, బండిపాలెం, రణస్థలం, జె.ఆర్.పురం తదితర గ్రామాల్లో ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే రణస్థలం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన పథకాలను గుర్తు చేస్తూ, గెలిచిన తర్వాత తాము చేయబోయే అభివద్ధి, సేవా కార్యక్రమాలను చెబుతూ ప్రజల మద్దతు కోరారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ, ఆపదలో అండగా ఉంటున్న తమకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెలమల రమణ, మహిళలు, వివిధ అనుబంధ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైపిపిని తరిమికొట్టాలి

ప్రజాశక్తి- పోలాకి

వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును సైకిలు గుర్తుపై వేసి తద్వారా వైసిపిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని ఎంపీ రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని సుసరాంలో మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తిని గెలిపించాలని కోరారు. అనంతరం భూషణరావు ఆధ్వర్యాన సుసరాం నుంచి 60, సంతలక్ష్మీపురం పంచాయతీ నుంచి సూరపు నారాయణదాసు ఆధ్వర్యాన పది, రాల్లపాడు పంచాయతీ నుంచి చిట్టి సింహాచలం ఆధ్వర్యానైదు, గాతలవలస సర్పంచ్ మెండ శ్రీనివాస్, ఎంపిటిసి వై.లక్ష్మణరావు ఆధ్వర్యాన 20, పిరువాడ పంచాయతీలో దంత సింహాచలం ఆధ్వర్యాన 20 కుటుంబాలు చేరాయి. వీరిని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వెంకట అప్పలనాయుడు, డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్, తమ్మినేని శారద, పంగ బావాజీనాయుడు, మెండ రాంబాబు, గొండు రామన్న, ఎస్.రమన్న, ఆర్.కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

టిడిపి కండువా వేస్తున్న రమణమూర్తి

మహిళలతో మాట్లాడుతున్న విజయ

ఇంటింటికీ సంక్షేమం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. మండలంలోని ధర్మపురం, కొఠారి పంచాయతీల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా జనరంజకమైన పాలన అందించారని తెలిపారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖరరెడ్డి, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, ధర్మపురం సర్పంచ్ పిట్ట రుక్మిణి, కొఠారి సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, పిట్ట శారద, కారంగి మోహనరావు, చంద్రయ్య, మోహన్‌దాస్, గుజ్జు ఢిల్లీరావు పాల్గొన్నారు.

ఇంటింటా 'సువ్వారి' ప్రచారం

ప్రజాశక్తి- పొందూరు

మండలం తాడివలస పంచాయతీలో స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ ఆదివారం జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో అవినీతి నాయకులను ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు తనకు ఒక్క అవకాశం కల్పించాలని ఇంటింటా తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. పంచాయతీ పరిధిలో గంగ్రేడు, వెంకంపేట, లచ్చయ్యపేట, కాలనీలో ప్రచారం చేశారు. ఈయనతో పాటు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సువ్వారి సువర్ణ, ఢిల్లీశ్వరరావు, పోతురాజు సూర్యారావు, పిన్నింటి అప్పలనాయుడు, చింతాడ శివ, వండాన అప్పన్న, సాయికుమార్ పాల్గొన్నారు.

తాడివలసలో ప్రచారం చేస్తున్న గాంధీ

ఎంపీ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చంద్రబాబు హయాంలోనే నగర అభివృద్ధి జరిగిందని, తిరిగి ఆయన సిఎం అయితే నగరం రూపు రేఖలు మారుతాయని కూటమి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు భార్య శ్రీశ్రావ్య అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ ఎదురుగా వున్న ఎపి హెచ్‌బి కాలనీలో శ్రీకాంత్ వర్మ, మధు ఆధ్వర్యాన ఆదివారం ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ మరదలు డాక్టర్ సిహెచ్ హరితతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీశ్రావ్య మాట్లాడుతూ నగరానికి కార్పొరేషన్ స్థాయి వున్నప్పటికి కనీస మౌలిక సౌకర్యాలు లేవన్నారు. అస్తవ్యస్థమైన డ్రైనేజీ, అధ్వన్నస్థితిలో రోడ్లు నాగరావాసులకు శాపంగా మారాయన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం నగరాన్ని నిర్లక్ష్యం చేసిందని, కనీసం మున్సిపల్ ఎన్నికలు కూడా నిర్వహించలేక పోయిందన్నారు. బాబు సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు సంక్షేమం కలుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు మహిళ అద్యక్షురాలు తమ్మినేని సుజాత, పార్టీ నాయకులు చిన్నారావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న శ్రీశ్రావ్య

అశోక్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో ఈదుపురంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. టిడిపి హయాంలో బాహుదా నదిపై వంతెన నిర్మాణం నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు దాసరి రాజు, దక్కత ఢిల్లీరావు, బోర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషను గెలిపించాలని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు ఓటర్లను కోరారు. మండలంలోని పూండిగోవిందపురంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, సీపాన గోపి, పాలవలస వేణుగోపాల్, జి.విఘ్నేష్, జి.అఖిల్, జి.గణేష్‌కుమార్, పాలిన చంద్రయ్య, పాలిన మోహనరావు, ఆర్.తుంబనాథం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

'స్పందన' ఆర్థికసాయం

సంతబొమ్మాళి: తోటి మనిషి సమస్య ఏదైనా మేమున్నాం అంటూ సాయం చేయడానికి బడేకుప్పన్నపేట కార్యస్థానంగా పనిచేస్తున్న కెపి స్పందన ఫౌండేషన్ ముందు ఉంటుంది. ఇందులో భాగంగా మండలంలోని ఆకాశలఖవారానికి చెందిన అనాథ బాలిక తుంగాన తులసికి వివాహానికి తనవంతు సాయంగా రూ.12 వేలు ఆర్థికసాయం ఆదివారం అందించింది. తులసి నాన్న చిన్నప్పుడే మృతి చెందగా, అమాయకురాలైన అమ్మ తనను కంటికి రెప్పలా సాకింది. ఈ నిరుపేద అమ్మాయి వివాహానికి గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థలు సాయం చేయాలని కోరారు. దీంతో స్పందన ఫౌండేషన్ సభ్యులు ఆమె ఇంటికి వెళ్లి ఆర్థికసాయం అందజేశారు. అలాగే కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ జి.రాజు రూ.5 వేలు అందజేశారు. సంస్థ ప్రతినిధులు షణ్ముఖరావు, శివారెడ్డి, సిమ్మన్న, ప్రసాద్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

'గీతాంజలి' విద్యార్థి ప్రతిభ

నరసన్నపేట: జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో స్థానిక గీతాంజలి స్కూల్ విద్యార్థికి రెండో స్థానం దక్కింది. విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్ హైదరాబాద్, కూకట్‌పల్లిలో ఆదివారం జాతీయ స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో నరసన్నపేట గీతాంజలి స్కూల్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థి పొట్నూరు జ్యోతిప్రకాష్ రెండో స్థానం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు కె.వి.శివప్రసాద్ మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది మంచి ఫలితాలను అందిస్తుందని అన్నారు. ప్రిన్సిపాల్ కె.కోటిబాబు, మేనేజ్‌మెంట్ సభ్యులు డి.సత్యనారాయణ, ఎ.మల్లికార్జునశాస్త్రి మాట్లాడుతూ జ్యోతిప్రకాష్ విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి విభిన్నమైన కార్యక్రమాలు చేపట్టి పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తామని తెలిపారు.

అవార్డు అందుకుంటున్న జ్యోతిప్రకాష్

పింఛన్ల పంపిణీలో రాజకీయమా?

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ విషయంలో వైసిపి రాజకీయాలు చేయడం తగదని, మే 1న లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరి డిమాండ్ చేశారు. వజ్రపుకొత్తూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాలతో ఆటలాడుకోవద్దని హితవుపలికారు. వృద్ధులను సచివాలయం చుట్టూ తిప్పి ఎవరైనా మృతి చెందితే దానిని విపక్షాలకు అంటగట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని వైసిపి చూస్తుందని విమర్శించారు. పింఛన్ల కోసం తిరుగుతూ మృతి చెందితే అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలు గానే పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయించాలని న్యాయస్థానాలు ఆదేశించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం దారుణం అన్నారు.

హేమబాబు చౌదరి

ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజక వర్గం పరిధిలోని అంపోలు, మంగళవారం పేట గ్రామాల్లో వైసిపి అభ్యర్థి, రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు రామ్ మనోహర్ నాయుడు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆదివారం చేపట్టిన ఈప్రచార కార్యక్రమంలో జగన్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో, నవరత్నాల ద్వారా గడచిన ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలకు మేలు చేసే వైసిపి ప్రభుత్వానికి తిరిగి పట్టం కట్టాలన్నారు. నియోజక వర్గంలో రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేపట్టిన అభివృద్ధి ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. గార మండలానికి వంశధార కుడి కాల్వ ద్వారా సాగునీరందించిన ఘనత ధర్మానకే దక్కుతుందన్నారు. శ్రీకాకుళం నగరంతో, గార మండలానికి కనెక్టివీటిని పెంచేందుకు విశాలమైన రోడ్లు నిర్మించారని, శ్రీకూర్మం, సాలిహుండం, కళింగపట్నం పర్యాటక రంగంలో అభివృద్ధి చేశారన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా పథకాలు అందించడం జరిగిందన్నారు. ఆయన వెంట గార మండల వైసిపి నాయకులు గొండు జయరాం, పీస శ్రీహరి, గొండు రఘురాం, కృష్ణమూర్తి, పృధ్వి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ధర్మాన రామ్ మనోహర్ నాయుడు

టిడిపిలో పలువురు చేరిక

కోటబొమ్మాళి: ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలోకి చేరారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మండలంలోని పెద్దబమ్మిడి నుంచి సిమ్మయ్యతో పాటు 250 మంది, నీలంపేట పంచాయతీ గుంట జగన్నాథపురం నుంచి సనపల లంబోదరుడుతో పాటు 50 మంది, సంతబొమ్మాళి మండలం కోటపాడు, మేఘవరం పంచాయతీ నుంచి 50 మంది, నందిగాం మండలం నర్సిపురం, నరేంద్రపురం పంచాయతీల నుంచి 50 మంది టెక్కలి మండలం గూడెం పంచాయతీ నుంచి ఐదు కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆర్‌కె ఆస్పత్రి వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్టార్ వాకర్స్ సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో ఆస్పత్రి ఎండి డాక్టర్ బాడాన రామ కోటేశ్వరరావు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ వందల మంది ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నడక కోసం వస్తుంటారని, వారిలో రక్తపోటు, చక్కెర వ్యాధులతో బాధపడుతున్న వారే అధికంగా ఉంటున్నారన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, వ్యాయామం సరిగా లేకపోవడం, ఒత్తిడికి గురవ్వడం వంటి అనారోగ్య సమస్యలకు కారణ మవుతాయన్నారు. అటువంటి వారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరిపించుకోవడం, సకాలంలో వైద్యం చేయించుకోవడం మంచిదన్నారు. సామాజిక బాధ్యతగా ఆర్‌కె ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఆస్పత్రి ఆధ్వర్యాన ప్రీమియం హెల్త్ కార్డులను ఆయన వాకర్స్‌కు అందజేశారు. ఈ శిబిరంలో వాకర్స్ ఇందిరా ప్రసాద్, ఎస్.జోగి నాయుడు, బార్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి గేదెల వాసుదేవరావు, డాక్టర్ జి.ఎన్.రావు, సంతోష్ పాల్గొన్నారు

అధ్వాన రహదారి పట్టించుకునే వారేరీ?

- రహదారిపై ప్రయాణం నిత్యం నరకం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అలికాం, బత్తిలి రహదారి నుంచి చవ్వాకులపేట ఇసుక ర్యాంపు వరకు సుమారు 6 కిలోమీటర్లు రహదారి ఛిద్రమై అధ్వానంగా తయారైనప్పటికీ పట్టించుకునే నాధుడే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014 ఏడాదికి ముందు అప్పటి ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి హయాంలో అలికాం, బత్తిలి రహదారి నుంచి సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం వరకు నూతన రహదారిని నిర్మించారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపి హయాంలో కనీసం ఈ రహదారి వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. టిడిపి హయాంలో పురుషోత్తపురం, చెవ్వాకులపేట వంశధార నది తీరంలో ఇసుక ర్యాంపులను మంజూరు చేసి నిత్యం ఇసుక లారీలు, ట్రాక్టర్లతో రహదారి నాశనమైపోయింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి చెవ్వాకులపేట ఇసుక ర్యాంపును గుత్తేదారులకు అప్పగించడంతో పరిమితికి మించిన లోడుతో రహదారిని మరింత గుల్ల చేసి పెద్దపెద్ద గోతుల మయంగా మార్చేశారు. చాలాసార్లు ఇదే రహదారిపై ఇసుక లోడ్లుతో వెళ్తున్న లారీలు బోల్తా పడిన సంఘటనలు ఉన్నాయి. రామచంద్రాపురం, పొన్నంపేట గ్రామస్తులు పలుమార్లు ఇసుక లారీల ప్రయాణంతో బెంబేలెత్తిపోతున్నామని రహదారులపై మెరుపు సమ్మెలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఇసుక గుత్తేదారులు పలుమార్లు తూతూ మంత్రంగా రహదారుల గోతులు మెటల్, క్రషర్ బూడిదతో కప్పినప్పటికీ రెండు రోజులు పోయేసరికి మళ్లీ గోతుల మయంగా రహదారులు తయారవ్వడంతో సమస్యలు మళ్లీ మొదటికొస్తున్నాయి. ఇదే రహదారిపై నిత్యం 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆమదాలవలస పట్టణానికి విద్యను అభ్యసించడానికి ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలతో గ్రామాలకు చేరుకోవడానికి ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నామని పలుమార్లు పాలకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యను పరిష్కరించలేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిత్యకృత్యంగా మారిన ఇసుక లారీల బోల్తా

మండలంలో చెవ్వాకులపేట వద్ద వంశధార నది నుంచి తవ్వకాలు జరుపుతున్న ఇసుక రవాణా లారీలు బోల్తాలు పడటం నిత్యకృత్యంగా మారింది. చెవ్వాకులపేట వద్ద నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు నుంచి లోడుతో వస్తున్న ఇసుక లారీలు రామచంద్రాపురం గ్రామ సమీపంలో పంట పొలాలు, రహదారులపై బోల్తా పడుతుండడం, ఇసుక ర్యాంపు నిర్వాహకులు క్రేన్ సహాయంతో లారీలను రోడ్డు పైనుంచి తీసి యధావిధిగా ఇసుక వ్యాపారాన్ని కొనసాగిస్తుండడం పరిపాటిగా మారింది. చెవ్వాకులపేట ఇసుక ర్యాంపు నుంచి విశాఖపట్నం రవాణా చేస్తున్న ఇసుక లారీలు ఇదే రహదారిలో పలుమార్లు బోల్తాలు పడటంతో పాటు గుంతల్లో ఇరుక్కోవడం పరిపాటిగా మారడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇసుక ర్యాంపు నుంచి ఉదయం వేళ తవ్వకాలు జరపాలని గతంలో అధికారులు ఆదేశించేవారని ప్రస్తుతం అటువంటి నిబంధనలు లేకపోవడంతో రాత్రి వేళలో ఈ గ్రామీణ రహదారిలో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగించడంతో చాలా ఇబ్బందిగా ఉందని ప్రజలు తెలుపుతున్నారు. అలికాం, బత్తిలి రహదారి నుంచి చవ్వాకులపేట వరకు ఉన్న బిటి రహదారి భారీ ఇసుక లారీలతో ప్రతినిత్యం రాకపోకలు సాగించడంతో భారీ గుంతలు ఏర్పడడం వలన వాహనాలతో గ్రామాలకు చేరుకోవడానికి ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నామని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పొన్నాంపేట వద్ద గత కొంత కాలం క్రితం ఇప్పిలి రమణమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు రాస్తా రోకో నిర్వహించి ఇసుక లారీలను నిలిపివేశారు. తరచూ ఇసుక లారీలు బోల్తా పడుతుందడంతో బిక్కు బిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు సుమారు మూడు గంటలసేపు రోడ్డుపై గ్రామస్తులు నిరసన తెలిపారు. ఇసుక ర్యాంపు నుంచి వచ్చిన ఇసుక లారీలు అలాగే ఆముదాలవలస నుంచి పురుషోత్తపురం వైపు వెళ్లే ఆటోలు ద్విచక్ర వాహనాలు చాలాసేపు రహదారి పైనే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని గ్రామస్తులను ఇసుక ర్యాంపు వద్దకు తీసుకువెళ్లి ర్యాంపు సిబ్బందితో చర్చలు కూడా జరిపారు. ఇసుక లారీ డ్రైవర్లు గుంతల రహదారిపై ఇష్టానుసారంగా నడుపుతున్నారని దీంతో తరచూ లారీలు బోల్తా పడుతూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అలాగే ఇసుక లారీలతో రహదారి పూర్తిగా పాడైపోయిందని, తాము ప్రయాణాలు చేయాలంటే చాలా ఇబ్బందులను ఎదుర్కొంటు న్నామని తమకు రహదారిని నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇసుకను తరలించేటప్పుడు లారీలపై టార్పాలిన్లు కప్పకుండా తీసుకువెళ్తున్నారని దీనివలన చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, పవర్ స్టీరింగ్ వాహనాల వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఐ వెంకటేష్‌కు తమ సమస్యలను వివరించామని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఏది ఏమైనప్పటికీ తమకు రహదారి విషయంలో న్యాయం జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు చిత్తశుద్ధితో రహదారి సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం

గడిచిన కొన్నేళ్లుగా రహదారి పాడవ్వడంతో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం పలుమార్లు నాయకులు, అధికారుల దృష్టికి రహదారి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదు. నిత్యం బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నాం ఏ క్షణాన ఏ లారీ ఎక్కడ తిరగబడుతుందో తెలియక సతమతమవుతున్నాం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో రహదారిని నిర్మించి సమస్య పరిష్కరించాలి.

- ఇప్పిలి సత్యనారాయణ, రామచంద్రాపురం

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నాం

రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. పరిసర గ్రామాల ప్రజలు పలుమార్లు ఆందోళన నిర్వహించి నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వానికి, పాలకులకు, అధికారులకు కనీసం చీమకుట్టినట్టైనా లేదు. . ఇప్పటికైనా రహదారిని నిర్మించి ప్రజల సమస్యను పరిష్కరించాలి. లేని పక్షంలో జనసేన పార్టీ తరపున మెరుపు సమ్మె చేస్తాం.

- పైడి మురళీమోహన్, జనసేన మండల అధ్యక్షుడు, సరుబుజ్జిలి

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

అధ్వానంగా ఉన్న దోకులపాడు రోడ్డు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామీణ ప్రాంతంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. కొన్ని గ్రామాలు ఇప్పటికీ తారురోడ్డు నిర్మాణాలకు నోచుకోలేదు. మరికొన్ని చోట్ల రహదారులు అభివృద్ధి నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు పూర్తి కాలేదు. దీంతో ప్రజలు పలు అవస్థలకు గురవుతున్నారు. రోడ్లలో ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రజలు భయపడుతున్నారు. వెంకటాపురం నౌపడ రహదారి చాలాచోట్ల గోతులమయమైంది.

శిలాఫలకాలకే పరిమితం

మండలంలోని రేయిపాడు-తెరపల్లి మీదుగా కొండవూరు వరకు రూ.95 లక్షలు, గల్లిశివరాంపురానికి రూ.119.42 లక్షల అంచనాలతో వ్యయంతో 2018లో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు జరగలేదు. పూడిలంక-ఉప్పుటేరుపై నుంచి రూ. 1.30 కోట్లు రహదారి నిర్మాణానికి అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. అవీ నేటికీ పూర్తి కాలేదు. సుమారు రూ.30 కోట్లతో నిర్మించిన నువ్వలరేవు వంతెన అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టకపోవడంతో 30 గ్రామాల ప్రజలు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 110 నివాసాలు తొలగించాల్సిన అవసరం ఉంది. నిర్వాసితుల సమస్య పరిష్కారం కాకపోవడంతో రహదారి నిర్మాణానికి వీలు పడటంలేదు. ఇటీవల పూండి రహదారి అభివృద్ధికి పనులు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ఆపేశారు. పాత రహదారిపై కొత్తగా ఒక పొర బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు నిమిత్తం రహదారికి ప్రొక్లెయినర్‌తో తవ్వి గీతలు పెట్టి మరీ వదిలేశారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దుక్కవానిపేట, మురిపింటివానిపేట గ్రామాలు ఇప్పటికీ తారు రోడ్డుకు నోచుకోలేదు. డోకులపాడు నుంచి సముద్ర తీరానికి వెళ్లే రహదారి పనులు పూర్తి కాలేదు. బెండి-వజ్రపుకొత్తూరు మీదుగా అక్కుపల్లి వరకు రహదారి విస్తరణ పనులు మొదట్లో చురుగ్గా సాగాయి. తరువాత నిలిచిపోయాయి. బెండి, వజ్రపుకొత్తూరు, డోకులపాడు, బాతుపురం, బైపల్లి తదితర చోట్ల సిసి రోడ్లు నిర్మాణాలు పూర్తిస్థాయిలో పనులు జరగక అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఓంశ్రీకృష్ణ

రెడ్డి శాంతిని గెలిపించాలి

ప్రజాశక్తి - పాతపట్నం

పాతపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతిని గెలిపించాలని ఆమె తనయుడు ఓంశ్రీకృష్ణ ఓటర్లను కోరారు. పాతపట్నంలోని శివశంకర్-1,2,3 వీధుల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న పాలనలోని సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవరిగాని ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలను సేకరిస్తున్న పోలీసులు

ఈదుపురంలో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసులు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటారు. అందులో భాగంగా మండలంలోని ఈదుపురంలో సిఐ టి.ఇమ్మాన్యుయేల్‌రాజు ఆధ్వర్యాన రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, కవిటి ఎస్ఐ రాము ఆదివారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ... తనిఖీలు చేపట్టారు. అలాగే సాయంత్రం లొద్దపుట్టిలో పోలీస్ కవాతు నిర్వహించారు.

హెచ్‌ఆర్‌సిఐ ఆర్గనైజింగ్ సెక్రటరీగా దుర్గాప్రసాద్

ప్రజాశక్తి- కవిటి

దుర్గాప్రసాద్

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా గొండ్యాల దుర్గాప్రసాద్‌కు ఉద్యోగోన్నతి లభించింది. మండలంలోని బెజ్జిపుట్టుగకు చెందిన సీనియర్ జర్నలిస్టు దుర్గాప్రసాద్ ఇప్పటి వరకు హెచ్‌ఆర్‌సిఐలో రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనను నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమిస్తూ చైర్మన్ రవీంద్రకుమార్, నేషనల్ సెక్రటరీ డాక్టర్ దేవభూషణ్ ఆదివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

వైసిపిలో వంద కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- నరసన్నపేట

సిఎం జగన్ పాలనను చూసి టిడిపి నుంచి వైసిపిలోకి వలసలు క్యూ కడుతున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సారవకోట మండలంలోని జోనంకి పంచాయతీ నుంచి 20, కొమ్మసరియాపల్లి పంచాయతీ నుంచి 60, వడ్డినవలసలో 20 నుంచి కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. వీరికి స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపి కండువా కప్పి ఆదివారం పార్టీలోకి ఆహ్వానించారు. జగన్మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి పాలనకు మద్దతు పలుకుతూ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అలాగే దాసన్నపై వ్యక్తిగత అభిమానంతో పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. మళ్లీ జగనన్నను సిఎంగా, దాసన్నను మళ్లీ ఎమ్మెల్యే గెలిపించేందుకు కృషి చేస్తామని అన్నారు. వైసిపిలో కలిసి వారిలో రగుతు నారాయణరావు, సూర్యనారాయణ, భానుమూర్తి, తిరుపతిరావు, తండేసు, ఢిల్లేశ్వరరావు, పోలాకి అప్పయ్య, గుండు సింహాచలం, కొల్లి సత్యం, బొద్దల సింహాచలం, సీతారాం బాబూరావు, పైలా గౌరేష్, వడ్డీనివలస నుంచి యాదవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జలుమూరు ఎంపిపి వాన గోపి, సారవకోట మండల పార్టీ అధ్యక్షులు వరుదు వంశీకృష్ణ, వరుదు దేవీప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్, పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి వెంకటరావు, మొజ్జాడ శ్యామలరావు, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి గురువిల్లి రమణి తదితరులు పాల్గొన్నారు. కాగా, తొగిరి సర్పంచ్ చల్ల తాతయ్య మర్యాద పూర్వకంగా కలిశారు.

వైసిపి కండువా వేస్తున్న కృష్ణదాస్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

టిడిపి, జనసేన, బిజెపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జనసేన నాయకులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయని అన్నారు. దీనిపై దృష్టి పెట్టే తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. రాష్ట్ర ప్రజల కోసం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పవన్ కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. వారికి అండగా నిలిచి టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు ప్రకృతి వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి నాయకులు చేసిన అరాచకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, డాక్టర్ దానేటి శ్రీధర్, దువ్వాడ హేంబాబు చౌదరి, దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ వి.దుర్గారావు, అట్టాడ వాసు, కూన కృష్ణారావు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన కార్యకర్తలు ఆదివారం వైసిపి నాయకులు సిర్ల రవిచంద్ర (బుజ్జి) ఆధ్వర్యాన వైసిలో చేరారు. వీరికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి నుంచి ఎనిమిదో వార్డు నర్సిపురానికి చెందిన రామచంద్ర రాజు, పత్తి రమేష్, గంగువాడకు చెందిన పైల వెంకటరావు, శివాజీనగర్‌కు చెందిన బూరెల మోహనరావు, గంధంమూర్తి, బంటుకొత్తురు పంచాయతీ కేసుపురానికి చెందిన దేవేంద్రపాత్రోలు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అభ్యర్థి అప్పలరాజు విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ బోర బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కండువా వేస్తున్న అప్పలరాజు

సమీక్షిస్తున్న శరవణ్‌కుమార్

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్నికల నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పార్లమెంటరీ వ్యయ పరిశీలకులు కె.కె.శరవణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర అధ్యక్షతన ఎన్నికలు విధుల్లో పాల్గొనున్న అధికార యంత్రాంగంతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థుల ఖర్చులు ఎలా రాస్తున్నారు, వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కరిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దినపత్రికలో వచ్చిన పెయిడ్ ఆర్టికల్‌పై సమీక్షించారు. ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్షం పనికి రాదని సూచించారు.

అచ్చెన్నాయుడు ఇంటింటా ప్రచారం

టెక్కలి: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నరసింగపల్లి, ముఖలింగాపురం కొల్లివలస, జగన్నాథపురం, పెద్దకేదారి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంత రైతాంగానికి అవసరమైన మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు సరఫరా చేశామని తెలిపారు. టిడిపి విజయానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వైసిపి ప్రభుత్వ హయామాలో ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పెనకాన అజయ్, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, వాళ్ల కుమార్, పుట్ట పురుషోత్తం, మామిడి రాము, వాళ్ల షణ్ముఖరావు, దారపు జోగారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నౌపడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. బడిఈడు పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను ఆదివారం నిర్వహించారు. మండలంలోని కోటపాడు, కొత్తూరు, వడ్డీతాండ్ర, బృందావనం, కాశీపురం, మహాదేవపురం, ఆరికవలస, చెట్లతాండ్ర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వాహనానికి ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాలను తెలియజేసే ఫ్లెక్సీను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలు గ్రామ గ్రామాన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కవిటి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు జగతికి చెందిన కంచి కామాక్షి అగ్నికుల క్షత్రియ సంఘం ప్రోత్సాహకాలు అందించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జగతిలో చదివిన పులకల జాహ్నవి (533), పులకల చరిష్మా (524), పొల్లాయి అనిల్ (489), దున్న గురు ప్రసాద్ (436)లకు ఆదివారం నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేసింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పొల్లాయి ఈశ్వరరావు, నాయుడు, పులకల వాసుదేవ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు

రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీలను ఓడించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోహనరావు

ప్రజాశక్తి - పలాస

విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన, రహస్య చెలిమి చేస్తున్న వైసిపిలను ఓడించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబుకు మద్దతుగా కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సభలో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం చట్టపరంగా ఇవ్వాల్సిన ప్రత్యేక హోదాను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయలేదని, విశాఖపట్నం రైల్వేజోన్ ఊసే లేదని విమర్శించారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి కాలేదన్నారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార సాగునీరు అందకపోవడంతో ఏటా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు మాట్లాడుతూ పలాస ప్రాంతంలో కబ్జాలు పెరిగిపోయాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. కబ్జాలపై తాను శ్వేతపత్రం విడుదల చేస్తానని, మిగతా అభ్యర్థులు కూడా శ్వేతపత్రం విడుదల చేసే సత్తా ఉందా సవాల్ విసిరారు. జీడిపిక్కలకు మద్దతు ధర కావాలని రైతులు ఉద్యమిస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైసిపి, టిడిపిలకు ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని, ఈ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జీవితేశ్వరరావు, సిపిఎం, సిపిఐ నాయకులు ఎన్.గణపతి, చాపర వేణుగోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోహనరావు

టిడిపిలో చేరిన వారితో రవికుమార్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని ధర్మపురం, వి.ఆర్.గూడెంకు చెందిన 40 కుటుంబాలు టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సమక్షంలో చేరారు. ధర్మపురానికి చెందిన 25 కుటుంబాలు మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము ఆధ్వర్యంలో, వి.ఆర్.గూడెంకు చెందిన 15 కుటుంబాలు సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు ఆధ్వర్యంలో టిడిపిలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి రవికుమార్ ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్ సువ్వారి పోలారావు, వైసిపి సోషల్ మీడియాకు చెందిన అన్నెపు రామారావు, కనమటి అప్పలనాయుడుతో పాటు ధర్మపురానికి చెందిన ఐదోవార్డు సభ్యులు చింతాడ లక్ష్మణరావు, పోలినాయుడు, పేడాద కృష్ణ తదితర కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, జిల్లా తెలుగుయువత కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నం నాయుడు, ఉపసర్పంచ్ ప్రతినిధి సువ్వారి గోవిందరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిర్వహిస్తున్న పోలీసు కవాతు

గ్రామాల్లో పోలీసు కవాతు

రణస్థలం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యాన్ని నింపేందుకు పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలోని ఎన్.జి.ఆర్.పురం, గురయ్యపేట, పోతయ్యపేట, చీకటిపేట తదితర గ్రామాల్లో ఆదివారం జె.ఆర్.పురం ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని ఎస్ఐ ప్రజలకు సూచించారు. ఎన్నికల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కేంద్ర సాయుధ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించి ఓటర్లలో మనోధైర్యాన్ని నింపారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి కేసులు నమోదైనా ఆ కేసులు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయన్నారు. బంగారు భవిష్యత్ కలిగిన యువకులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలన్నారు. రానున్న కాలంలో మంచి ఉద్యోగాలు సంపాదించుకునేలా ఉన్నత మైన భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారానికి 123వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బెంతు ఒరియాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకూ దూరమవుతుందని తెలిపారు. తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

ఎన్నికల కోడ్ అమల్లో నిర్లక్ష్యం

మద్దువలస ఫేజ్-2 పనుల శంకుస్థాపన శిలాఫలకం

ప్రజాశక్తి- పొందూరు

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నెలన్నర రోజులు దాటింది. నామినేషన్ల ప్రక్రియ పూర్తికావస్తుంది. పోలింగ్ తేదీ సమీపిస్తుంది అయినా కొన్ని చోట్ల ఎన్నికల కోడ్‌ను అమలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు పేరిట పలుచోట్ల శంకుస్థాపన చేసిన శిలాఫలకాలపై రాజకీయ పార్టీల నేతల ఫోటోలను మాత్రం మూసివేయకుండా అధికారులు నిర్లక్ష్యం పాటిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల పక్కనే ఇలా పార్టీల నేతలతో కూడిన శిలాఫలకాలు కనిపిస్తున్నా ఎన్నికల సిబ్బంది వాటిపై దృష్టి సారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పొందూరు-చిలకపాలెం రహదారిలో మద్దువలస రెండో దశ పనులకు సంబంధించి వావిలపల్లిపేట సమీపంలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకం మూసివేయలేదు. అలాగే ఇల్లయ్యగారిపేట గ్రామం ప్రవేశం వద్ద గల శిలాఫలకాలు కూడా మూసివేయకపోవడంపై పలువురు ఎన్నికల అధికారుల తీరుపై విమర్శిస్తున్నారు. వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అంటూ పలువురు బాహటంగా పేర్కొంటున్నారు.

ఇల్లయ్యగారిపేటలో మూసివేయకుండా ఉన్న శిలాఫలకాలు

పట్టుబడిన ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది

22 ద్విచక్ర వాహనాలు సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోటలో ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువ జామున పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అలాగే సరుబుజ్జిలి మండలంలోని షలంత్రి గ్రామంలో ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డాన్ సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో నిర్వహించిన కార్డాన్ సెర్చ్‌లో మొత్తం 22 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ వాహనాలు కొనేటప్పుడు సంబంధిత పత్రాలను సరిచూసుకొని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం -ఆమదాలవలస ప్రధాన రహదారిలో ప్రయాణించే వాహనదారులు, జెమ్స్ ఆస్పత్రికి వెళ్లే రోగులు, వారి బంధువులకు మార్గ మధ్యలో దాహార్తిని తీర్చడానికి రాగోలు మజ్జి గౌరమ్మ ఆలయం వద్ద మేము సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రను దృష్టిలో ఉంచుకుని ఆదివారం నుంచి ప్రతిరోజూ ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు పొట్నూరు అప్పారావు, రామకృష్ణ తెలిపారు. వందల సంఖ్యలో ప్రయాణికులకు ఈ కేంద్రం ద్వారా ఉపశమనం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.వి.ఎస్.ఎన్. మూర్తి, సత్యనారాయణ, త్రినాథరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న మేము సైతం సభ్యులు

కొండపోడు సాగుకు దూరం

- ఏటా తగ్గుతున్న ఆదాయం
- ఆసక్తి చూపని గిరిజనులు

పెంగువాడలో పోడు పంటలు లేక బోసిపోయిన అటవీ ప్రాంతం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిల్లాలో గిరిజనుల జీవనాధారం క్రమేపీ తగ్గుముఖం పడుతుంది. విస్తారంగా ఉండే కొండ ప్రాంతాల్లో గిరిజనులకు జీవనాధారంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి భిన్నంగా మారాయి. పోడు పంటలతో ఏడాది పొడవునా గిరిజనులకు జీవనాధారంగా ఉండేది. వాతావరణ పరిస్థితులు గత మూడేళ్లగా వర్షాభావ పరిస్థితులు, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పోడుపంటలైన జొన్న, సజ్జ, గంటెలు, సామలు, చోడి, సారి కందులు పంటల సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆరుగాలం కొండలపైనే గిరిజన రైతులు శ్రమించి ఈ పంటలు సాగు చేసేవారు. పంటలు పండకపోవడంతో వారి జీవనానికి ఆసరా కోల్పోవాల్సి వచ్చిందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. అలాగే ఏటా జీవనాధారంగా ఉండే జీడి సాగుకు తెగుళ్ల బెడద వెంటాడుతుండడంతో జీడి ఫలసాయమూ తగ్గుముఖం పట్టి ఆదాయాన్ని కోల్పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల్లో పోడు, 25 వేల ఎకరాల్లో జీడి సాగు అవుతుంది. ఇందులో అత్యధికంగా మందస, మెళియాపుట్టి, పలాస, పాతపట్నం, కొత్తూరు, సోంపేట, టెక్కలి మండలాల్లో పోడు, జీడి సాగవుతుంది. అలాగే కొన్ని ప్రాంతాల్లో గిరిజన రైతులు పోడు పంటలకు ప్రత్యామ్నాయంగా పత్తి, అరటి, ఇతర పళ్ల జాతుల మొక్కలు, కొండ చీపుర్లను సాగు చేస్తున్నారు. ఇందులో కొండ చీపుర్లతో గిరిజనులకు కొంత ఆదాయాన్ని ఊరటనిస్తుంది. అటవీ ఉత్పత్తులైన కుంకుడు, ఉసిరి, నేల వాము, తిప్పతీగ వంటి వనమూలికలు లభ్యమవుతున్నా... జిసిసి ద్వారా కొనుగోలు నామమాత్రంగా ఉండడంతో ఆదాయానికి గిరిజనులు దూరం అవుతున్నారు. అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే కొండ తామర చెట్టు విస్తారంగా ఉన్నప్పటికీ వాటి నుంచి జిగురు సేకరణపై అవగాహన లేకపోవడం, అలాగే జిగురు సేకరణపై జిసిసిలు శ్రద్ధ చూపకపోవడంతో గిరిజనులు ఆదాయాన్ని కోల్పోతున్నారు. గిరిజనులకు అన్ని విధాలుగా ప్రోత్సాహంగా ఉండే ఐటిడిఎ ద్వారా ప్రోత్సాహకం అంతంత మాత్రంగానే మిగిలింది.

జీవనోపాధి కష్టంగా ఉంది

పోడు పంటలకు దూరం కావడంతో జీవనోపాధికి కష్టంగా ఉంది. గతంలో వర్షాలు కురవడంతో పంటలు పండేవి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వాలు, అధికారులు స్పందించి గిరిజనులకు ఆసరా కల్పించేందుకు చర్యలు చేపట్టాలి.

- వాబ పోలయ్య, ఆంపురం